నిర్వహణలో నిర్లక్ష్యం..!

పార్కులు, వాక్‌వేలపై పర్యవేక్షణ కరువు

- మరమ్మతులకు గురవుతున్న క్రీడాపరికరాలు, ఓపెన్ జిమ్‌లు
- నిరుపయోగంగా మారిన మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్లు
- నిరుత్సాహంగా వెనుదిరుగుతున్న సందర్శకులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పీవీ నర్సింహారావు పార్కులో మరమ్మతుకు గురైన 'సీ–శా'

ఖమ్మంమయూరిసెంటర్: అభివృద్ధికి కేరాఫ్‌గా ఖమ్మం నగరాన్ని మార్చాలనే ఉద్దేశంతో నగరంలో ఇదివరకు ఉన్న పార్కులు, వాక్‌వేలను ఆధునీకరిస్తూనే.. కొత్త పార్కులు, వాక్‌వేలను ఏర్పాటు చేస్తున్నారు. నగర ప్రజల అవసరాల మేరకు ప్రతి పార్కు, వాక్‌వేలో చిన్నారులకు ఆట వస్తువులు, పెద్దలకు ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలు కల్పిస్తూ.. ప్రజలు ఆహ్లాదంగా గడిపేలా నిర్మాణాలు చేపట్టారు. అయితే వాటి నిర్వహణ చూసే వారు లేక అందులోని ఆటవస్తువులు, ఓపెన్ జిమ్‌లు మరమ్మతులకు గురవుతూ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఆడుకునేందుకు చిన్నారులు వెళ్తే అక్కడ ఆటవస్తువులు తుప్పు పట్టి విరిగిపోయి ఉండడంతో వెనుదిరుగుతున్నారు. ఆటవస్తువులు పాడై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పార్కులు, వాక్‌వేలపై పని చేసే సిబ్బంది సైతం పాడైన వస్తువుల గురించి అధికారులకు తెలపడం లేదు.

రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగంగానే..

పార్కులు, వాక్‌వేలపై ఓపెన్ జిమ్‌లు, చిన్నారుల ఆట వస్తువులు, మోడ్రన్ టాయిలెట్లను రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మిస్తున్నారు. ఓపెన్ జిమ్‌లు, ఆట వస్తువులకు నగరవాసులు, చిన్నారుల నుంచి వస్తున్న ఆదరణ చూసి అనేక ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ వస్తువులను ఏర్పాటు చేయడానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కానీ, ఈ వస్తువులను ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్లు కొన్నేళ్ల పాటైనా వీటి నిర్వహణ చూడకుండా.. తమ పని అయిపోయిందిలే అన్నట్లు వ్యవహరిస్తూ.. చేతులు దులుపుకుంటున్నారు. ఇక అధికారులు వాటికి మాకు ఎటువంటి సంబంధం లేనట్లుగా ఉంటున్నారు. దీంతో అవన్నీ తుప్పుపట్టి విరిగిపోయి ఉన్నాయి.



వేణుగోపాల్‌నగర్ సాగర్ కెనాల్‌పై ఒక ఊయల ఊడిపోయిన దృశ్యం

నాణ్యత లేకనే..

నగరంలోని వేణుగోపాల్‌నగర్ సాగర్ కాల్వ కట్టపై రూ.లక్షలు వెచ్చించి వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయడంతో పాటు చిన్నారుల కోసం జారుడు బల్లాలు, ఊయలలు, ఇతర ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. కానీ వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడం, సరైన నాణ్యత కలిగిన వస్తువులు ఏర్పాటు చేయకపోవడంతో త్వరగా మరమ్మతులకు గురయ్యాయి. ఏర్పాటు చేసిన రెండు ఊయలలో ఒకటి ఊడిపోయింది. ఇక చిన్నారులు 'సీ–శా'ఆడుకునే ఆట వస్తువు మరమ్మతుకు గురైంది.

నిరుపయోగంగా..

వేణుగోపాల్‌నగర్ సాగర్ కాల్వపై వాకర్స్, స్థానికుల అవసరాల కోసం వాక్‌వేపై మోడ్రన్ టాయిలెట్లు నిర్మించారు. కానీ, వీటి నిర్వహణపై పట్టింపులేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. తలుపులు ఊడిపోయి శిథిలావస్థకు చేరుతున్నాయి. టాయిలెట్ల లోపల పనికిరాని వస్తువులను వేసి స్టోర్ రూమ్‌గా మార్చారు.

నెలలు గడుస్తున్నా..

నగరంలోని పీవీ నర్సింహారావు పార్కులో చిన్నారులతో పాటు పెద్దలు ఆహ్లాదంగా గడిపేందుకు పార్కును అభివృద్ధి చేశారు. చుట్టూ పచ్చిక, పక్కన ఓపెన్ జిమ్, ఓ పక్కన ఇసుకలో చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఈ పార్కులో చిన్నారులు ఆడుకునే 'సీ–శా'ఆట వస్తువులు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారు లేరు. సాయంత్రం వేళ పార్కులో ఆడుకునేందుకు వచ్చిన చిన్నారులు ఆట వస్తువులు మరమ్మతులకు గురై ఉండడాన్ని చూసి నిరుత్సాహంగా వెనుదిరుగుతున్నారు.



సాగర్ కెనాల్ వాక్‌వేపై నిరుపయోగంగా ఉన్న మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్లు

మరమ్మతులు చేయిస్తాం..

నగరంలోని పార్కులు, వాక్‌వేలపై ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులను ఏర్పాటు చేయించాం. ఎక్కడైనా మరమ్మతులకు గురైనట్లు మా దృష్టికి వస్తే వెంటనే బాగు చేయిస్తున్నాం. ఓపెన్ జిమ్‌లు, ఆట వస్తువుల నిర్వహణ పక్కాగా ఉండాలని కాంట్రాక్టర్లకు సూచించాం.

– కృష్ణాలాల్, ఈఈ, కేఎంసీ

పార్టీ బలోపేతమే లక్ష్యం

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 60 కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు ఆధ్వర్యాన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈమేరకు పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేస్తూ పాలేరులో షర్మిల గెలుపు కోసం గ్రామస్థాయి నుంచి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గుగులోత్ రూప్లానాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్, నాయకులు ఎడవల్లి వెంకయ్య, బాణోత్ వీరునాయక్, తోట వీరభద్రయ్య, లావూరి కోటేశ్వరావు, గుగులోత్ నాగేశ్వరరావు, అప్పారావు, మల్లికార్జున్, నారప రెడ్డి, బీమాల రవి, ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో సుధీర్‌బాబు

తెలంగాణ పోరాట యోధుడు 'మంచికంటి'

ఖమ్మంమయూరిసెంటర్: నిజాం సైన్యానికి సవాల్ విసిరి పోలీస్‌స్టేషన్‌లపై దాడి చేసి, నైజాం నవాబును గడగడలాడించిన వ్యక్తి, తెలంగాణ పోరాట యోధుడు మంచికంటి రాంకిషన్‌రావు అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బుగ్గవీటి సరళ పేర్కొన్నారు. బుధవారం రాంకిషన్‌రావు 27వ వర్ధంతి సభ స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించగా ఆమె మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీకి జిల్లాకు కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక రాష్ట్ర నాయకుడిగా పని చేసి అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని తెలిపారు. జిల్లా నాయకుడు కల్యాణం వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, నాయకులు పి.సుబ్బారావు, టి.విష్ణు, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసనకు సంఘీభావం

రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన పండిట్, పీఈటీ పోస్టులకు పదోన్నతులు కల్పించి రాష్ట్ర వ్యాప్తంగా వారు చేస్తున్న ఆందోళనను విరమింపజేయాలని, టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ వేపకుంట్ల పాఠశాలలో పండిట్, పీఈటీలు చేస్తున్న ఆందోళనకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పిల్లల విద్యాభ్యాసానికి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో పాఠశాల హెచ్‌ఎం నారాయణ, జేవీవీ నాయకులు అలవాల నాగేశ్వరరావు, పద్మావతి, ఝాన్సీ, నరసింహారావు, కిషన్‌రావు, జానీవియా, కిష్టు, రమేష్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ రాహుల్ సందేశం చేరాలి



నేలకొండపల్లి: రామచంద్రాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేలకొండపల్లి/కామేపల్లి (కారేపల్లి) : గడపగడపకూ రాహుల్‌గాంధీ సందేశం చేరవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో బుధవారం హథ్ సే హథ్ జోడో పాదయాత్ర చేపట్టి ఇంటింటికి వెళ్లి సందేశం అందించారు. అలాగే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హత్ సే హత్ జోడోయాత్రను జయప్రదం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కామేపల్లి మండలం పాతలింగాలలో జరిగిన సమావేశంలో రాంరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలతో కాలం వెల్లబుచ్చుతున్నారని, సాధించుకున్న తెలంగాణలో రైతు ఆత్మహత్యలు ఆగట్లేదన్నారు. నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీలు బొడ్డు బొందయ్య, కట్టెకోల సుధాకర్, నాయకులు కట్టెకోల నాగేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, కుక్కల హనుమంతరావు తదితరులు పాల్గొనగా.. కామేపల్లిలో జరిగిన సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ చింతకుంట విజయరమణారావు, యూత్ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రంతో పాటు గింజల నర్సింహరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, రామకృష్ణ, భాషా్‌సింగ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభించిన 'రాయల'..

నేలకొండపల్లి మండలంలోని బోదులబండలో రాయల యువసేన ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ చేశారు. నాయకులు యడవల్లి నాగరాజు, జంగం లక్ష్మీనారాయణ, సుబ్బారావు, నాగార్జున, ఆదాం, పి.రవి, ఖాజావియా, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మంమామిళ్లగూడెం: నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో బుధవారం నిర్వహించిన డిపో మహాసభలో ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం డిపో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి సమావేశానికి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఈదురు వెంకన్న హాజరయ్యారు. ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడిగా బేతంపూడి బుచ్చిబాబు, డిపో కార్యదర్శిగా గుడిబోయిన శ్రీనివాస్, కోశాధికారిగా వై.భుజంగర్, కార్యదర్శిగా పి.వెంకటేశ్వర్లు, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.జగన్నాథంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. అనంతరం వివిధ సంఘాల నుంచి 50 మంది కార్మికులు యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో రీజియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లికొండ వెంకన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, పాటి అప్పారావు, జె.కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, అనిత, అరుణమ్మ, రాధ, ఆదిలక్ష్మి, తిరుపత్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన అందించిన స్కూల్ బ్యాగులను బుధవారం ఎంపీడీఓ అశోక్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, శశిధర్, పాఠశాల హెచ్‌ఎం బోడ పెంటు, ఎస్‌ఎంసీ చైర్మన్ చంద్రకళ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

భయం వీడితేనే ఉత్తమ ఫలితాలు



సుధీర్‌ను సన్మానిస్తున్న పాఠశాల బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి విద్యార్థులు భయాన్ని వీడి శ్రద్ధగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలు వస్తాయని క్లినికల్ సైకాలజిస్ట్ అండ్ లైఫ్ స్కిల్స్ డెవలపర్ సంద్ర సుధీర్ పేర్కొన్నారు. నగరంలోని త్రివేణి పాఠశాలలో డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి ఆధ్వర్యాన బుధవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ భయాన్ని వీడి చదువుకుంటూ పరీక్షలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లోగా పరిష్కరిస్తాం

నేలకొండపల్లి: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో గిరిజన రైతులకు చెందిన దారి పంచాయతీపై బుధవారం ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఇటీవల దారి పంచాయతీపై ఆందోళనలు నిర్వహించడంతో పాటు గురువారం మండల దిగ్బంధం కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆర్డీఓ విచారణ చేపట్టి గిరిజన రైతులతో చర్చించి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఈ సమస్యను వారం రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. దీంతో మండల దిగ్బంధనం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆందోళనాకారులు ప్రకటించారు. అదే విధంగా గ్రామ కంఠం భూమి నాలుగు ఎకరాలు, దేవాదాయ శాఖకు చెందిన 20 కుంటలు భూమిని స్వాధీనం చేసుకోవాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ ఏడీ సర్వేయర్ లూర్థు, తహసీల్దార్ దారా ప్రసాద్, గిరిజన సంఘం ప్రతినిధులు భూక్యా రవికుమార్, రంజిత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న ఆర్డీఓ రవీంద్రనాథ్

బడ్జెట్‌లో విద్యారంగానికి దక్కని ప్రాధాన్యత

ఖమ్మంమయూరిసెంటర్/కూసుమంచి: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వకుండా 6.57 శాతం నిధులు మాత్రమే కేటాయించి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈమేరకు బుధవారం ఖమ్మంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అలాగే కూసుమంచిలో బీడీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, బీడీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి గోపి వినయ్ మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, మోదీ తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని డిమాండ చేశారు. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నాయకులు శ్రావ్య, ఊహ, జ్యోతి, నవ్య, ప్రవళిక, అనూష, శ్రీలత తదితరులు పాల్గొనగా.. కూసుమంచిలో జరిగిన ర్యాలీలో నాయకులు చంద్రశ్రీ, ప్రమీల, సంధ్య, వీణ, వంశీ, నవీన్, ఉదయ్, జగన్, ఉపేందర్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మంత్రిని కలిసిన ఏసీపీ



మంత్రికి మొక్క అందజేస్తున్న ఏసీపీ గణేష్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఖమ్మం ఏసీపీ గణేష్ బుధవారం ఖమ్మంలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రిని కలిసి పూలమొక్కను అందజేశారు.

మంత్రి ఎర్రబెల్లికి వినతి..

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో రోడ్లు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఎస్.కోటయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు బుధవారం విన్నవించారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన సర్పంచ్ రైతుల సౌకర్యార్థం తమ గ్రామంలోని దళిత కాలనీ పక్కన కాల్వ కట్ట అనుకొని రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరగా.. మంత్రి హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంఓకు..

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్‌ను ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్యభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్రభుత్వ ఆస్పత్రి ఆర్‌ఎంఓ బి.శ్రీనివాసరావుకు సీపీఎం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ మాట్లాడుతూ.. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ కాలేజీగా మారుతున్న తరుణంలో ఎంఆర్‌ఐ స్కానింగ్ అవసరం వుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు ఎస్.రమేష్, గౌస్, వెంకన్న, పి.వాసు, రెడ్డి, గణపతి తదితరులు పాల్గొన్నారు

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

తిరుమలాయపాలెం: సేవా కార్యక్రమాల్లో ప్రజా సంఘాల నాయకులు ముందుండాలని కాసా జాతీయ సేవా సంస్థ కోఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మాదిరిపురంలో జన నిర్మాణ ఐక్య వేదిక కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు మనోజ్, నీలమ్మ, బద్రి, వీరన్న, సుజాత, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టు గర్హనీయం

ఖమ్మం మామిళ్లగూడెం: బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అల్లిక వెంకటేశ్వరావును అరెస్ట్ చేయడం గర్హనీయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి అన్నారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బీసీ రిజర్వేషన్ జనాభా దమాషా ప్రకారం.. పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జరుగుతున్న అసెంబ్లీ ముట్టడికి మద్దతు ఇస్తున్న అల్లిక వెంకటేశ్వరావును అరెస్టు చేయడం సరైంది కాదన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు, సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: సెర్ప్ ఉద్యోగుల శ్రమను గుర్తించి రాష్ట్ర బడ్జెట్‌లో సెర్ప్ ఉద్యోగులకు పేస్కేలు వర్తింపచేస్తున్నట్లుగా సీఎం కేసీఆర్ పేస్కేల్ ప్రకటించడం పట్ల ఖమ్మం జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు కొండపురెడ్డి నరేందర్ రెడ్డి, కంద్రాతి వెంకటేశ్వర్లు, చిన్ని వెంకటేశ్వర్లు, కె.సుభద్ర, కె.వీరభద్రం, జి.అశోక్ రెడ్డి, జె.వెంకటనారాయణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేత తీరుపై నిరసనలు

ఖమ్మం మామిళ్లగూడెం/ ఖమ్మం క్రైం/ నేలకొండపల్లి/ ఖమ్మంరూరల్/ ఖమ్మంమామిళ్లగూడెం/ ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ శాఖ అధికారి సమతపై దాడి చేసి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణును వెంటనే అరెస్ట్ చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజా సంఘాలు, బీజేపీ, బీఎస్పీ, యూనిటీ ఆఫ్ మాల, పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపట్టి, వేణుపై చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఖమ్మంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బుర్ర ఉపేందర్ సాహూ ఆధ్వర్యంలో సీపీ విష్ణు ఎస్ వారియర్‌కు వినతి పత్రం అందజేయగా.. ప్రగతిశీల మహిళా సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షురాలు శీలం పూలమ్మ, మండల కార్యదర్శి బందెల లలితలు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు నశించాలని డిమాండ్ చేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అనుచరుల ఆగడాలు పెరిగాయని జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ అన్నారు. వేణుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాలమహానాడు మండల అధ్యక్షుడు బట్టపోతుల ప్రకాశం డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగి అని కూడా చూడకుండా బెదిరింపులకు పాల్పడిన వేణును వెంటనే అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పేర్కొన్నారు. కాగా, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శిరోమణి, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు గంట శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమతను బుధవారం పీఓడబ్ల్యూ, పీవైఎల్ ప్రతినిధులు పరామర్శించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరావును యూనిటీ ఆఫ్ మాల ఆధ్వర్యంలో కలిసి సమతకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు, జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, కో కన్వీనర్‌లు రహమాన్, భద్రూనాయక్ , పద్మాచారి, జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరావు, ఆయా సంఘాల నాయకులు ఉపేందర్, నాగరాజు, విజయ్ ,మంజుల, శ్రీకాంత్, మన్నె కృష్ణారావు, ఝాన్సీ, చైతన్య, చందు, అశోక్, మన్నె కృష్ణారావు, కోటి హనుమంతరావు,జ్ఞానరత్నం, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, కందుల ఉపేందర్, గుమ్మడి కనకరాజు, డాక్టర్ ఎంఎఫ్ గోపినాథ్ పాల్గొన్నారు.



ఖమ్మంగాంధీచౌక్: సమతను పరామర్శిస్తున్న పీఓడబ్ల్యూ, పీవైఎల్ ప్రతినిధులు

క్లుప్తంగా

సమీకృత మార్కెట్‌లోకి రైతుబజార్ తరలింపు



స్టాళ్ల కేటాయింపును పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని వీడీవోస్ కాలనీ ఏసీపీ కార్యాలయం వెనుక ప్రాంతంలో నిర్మించిన సమీకృత మాంసాహార, శాఖాహార మార్కెట్ సముదాయంలోకి ఇల్లెందు క్రాస్ రోడ్డులో ఉన్న రైతుబజార్‌ను బుధవారం రాత్రి తరలించారు. కలెక్టర్ వీపీ గౌతమ్ పర్యవేక్షణలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కోలాహలం నాగరాజు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి శివరామ కృష్ణలు రైతులకు సమీకృత మార్కెట్‌లో స్టాళ్లను కేటాయించారు.

నియామకం

నేలకొండపల్లి: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నేలకొండపల్లి మండలంలోని అనాసాగారం గ్రామానికి చెందిన కోటి హనుమంతరావు నియమితులైనట్లు బుధవారం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, సూరేపల్లి జ్ఞానరత్నం, కాశంగి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

కూసుమంచి: దివ్యాంగుల చట్టం 2016 సెక్షన్ 92కు సంబంధించిన పోస్టర్లను దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సై సురేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కులకు ఎవరూ భంగం కలిగించకుండా సమాజంలో వారిని గౌరవప్రదంగా చూడాలని తెలిపారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు మల్లిఖారున్, దాసరి ఉప్పయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

నేడు లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడి

నేలకొండపల్లి: హమాలీలకు ఉపాధి భద్రతతో కూడిన చట్టం రావాలని కోరుతూ నేడు లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని ఇఫ్టూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు కోరారు. బుధవారం మండల కేంద్రంలో సివిల్ సప్లై హమాలీల ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం నాయకులు రాంబాబు, తెలగమళ్ల ఉపేందర్, పి.లక్ష్మయ్య, వీరన్న, తిరపయ్య, బోడ బుజ్జి, కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

13న రహదారి దిగ్బంధం

తిరుమలాయపాలెం: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 13న చేపట్టే విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారి దిగ్బంధనాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ డివిజన్ ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావుమాదిగ అన్నారు. బుధవారం తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగలను మోసం చేసే విధంగా బీజేపీ వ్యవహరిస్తుందని, పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లును చేయకుండా చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు చింతిరాల నాగభూషణం, టేకుమట్ల బాబు, వీరభద్రం, ప్రభాకర్, శ్రీను, మేగరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై 14న ధర్నా

నేలకొండపల్లి: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీటు జిల్లా నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బి.కోటేశ్వరీతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

నేలకొండపల్లి: మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన ఓ యువకుడికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. సదరు యువకుడు ఒక నెలలోనే మూడు పర్యాయాలు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడడంతో పోలీసులు బుధవారం కోర్టులో హాజరు పరిచారు. ఈమేరకు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని కోర్టు కానిస్టేబుల్ సోమన్న తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రైటర్ పద్మభూషణ్
వినోద	శివ వేద
సాయిరాం	వీర సింహారెడ్డి
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	రెబెల్స్ ఆఫ్ తుపాకులగూడెం

\- ఖమ్మంవ్యవసాయం